క్లుప్తంగా

సేవతోనే సంతృప్తి



ఎమ్మెల్యే రాగమయికి నగదు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిటౌన్: సేవతోనే సంతృప్తి ఉంటుందని.. అత్తమ్మ డాక్టర్ మట్టా ఆరోగ్యం చేసిన సేవా కార్యక్రమాలు మాకు ఆదర్శ ప్రాయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం పట్టణంలోని తేజా ఒకేషనల్ కళాశాలలో.. ఖమ్మం వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.70వేల నగదు, నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఎమ్మెల్యేకు అందించగా.. ఆమె కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ, గాయత్రి, తేజా కళాశాలల నిర్వాహకులు కూసంపూడి మధుసూదన్‌రావు, పాలా ప్రవీణ్‌రెడ్డి, ఎండీ కమల్‌పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలన



రామన్నపాలెం పాఠశాలలో పరిశీలిస్తున్న డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు రామన్నపాలెం గ్రామాల్లోని పాఠశాలలను సోమవారం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు బోధన విషయంలో తగిన ప్రామాణికాలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, లెక్చరర్ సత్యనారాయణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నివాళి



ఉత్తమ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమకుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హైదరాబాద్‌లోని ఉత్తమ్‌కుమార్ రెడ్డి నివాసంలో పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శౌరి సేవలు చిరస్మరణీయం



శౌరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ శౌరి సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. మిట్టపల్లిలో సోమవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శౌరీ పేద ప్రజల కోసం పనిచేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు రఘుపతిరెడ్డి, రోశయ్య, శరత్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి..

కారేపల్లి: మండలంలోని సూర్యతండా గ్రామానికిచెందిన ఫారెస్ట్ అధికారి సురేష్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా ఆయన సంస్మరణ కార్యక్రమం సోమవారం ఖమ్మంలో నిర్వహించగా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ హాజరై సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, శ్రీనివాసరావు, వీరన్న, రామ్‌కిషోర్, సక్రు నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడు భద్యానాయక్ మృతి

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోత్ భద్యానాయక్(75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, మాజీ ఎంపీటీసీ రామ్‌చందర్, బానోత్ రాందాస్‌నాయక్, వాంకుడోత్ గాంధీ, బానోత్ లీలావతి, సుమా, కైకా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలంకారప్రాయమేనా..?

- నిరుపయోగంగా మార్కెట్ కమిటీ గోదాం
- రూ.40 లక్షలు వెచ్చించినా రైతులకు ఉపయోగపడని వైనం



మల్లవరం సమీపంలో ఉన్న మార్కెట్ కమిటీ గోదాం

తల్లాడ: వైరా వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతుల అవసరాలకు ఆసరాగా నిలిచేందుకు మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన గోదాం అలంకారప్రాయంగా తయారైంది. ధాన్యం, పత్తి, అపరాలను రైతులు నిల్వ చేసుకునేందుకు గోదాంను నిర్మించారు. తల్లాడ మండలం మల్లవరం సబ్ స్టేషన్ పక్కనే ఉన్న స్థలంలో 2004 సంవత్సరంలో రూ.30 లక్షలు వెచ్చించి మార్కెట్ కమిటీ గోదాం నిర్మించింది. రూ.10 లక్షలతో ప్రహరీ, ప్లాట్ ఫారం నిర్మించారు. మొత్తం రూ.40 లక్షలు వెచ్చించినా రైతులకు అంతంత మాత్రంగానే ఉపయోగపడుతుంది.

ఇరవై ఏళ్లుగా నిరుపయోగం..

గత 20 ఏళ్లుగా వైరా మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న గోదాం అలంకార ప్రాయంగా ఉంటుంది. గోదాం నిర్మించిన తర్వాత ఐకేపీ ఆధ్వర్యంలో 10 ఏళ్ల క్రితం వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఈ గోదాంలో మళ్లీ కొనుగోళ్లు జరగడం లేదు. వరి ధాన్యం, పత్తి, ఇతర అపరాలను కూడా నిలువ చేయడం లేదు.

కల్లాల్లో అమ్ముకుంటున్న రైతులు..

రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులు నిల్వ చేసుకొనే వీలు లేక పొలాల్లోనే పంటలను అమ్ముకుంటున్నారు. తల్లాడ సబ్ స్టేషన్ పరిధిలో గోదాం ఉన్నా అందులో ఎలాంటి పంటల ఉత్పత్తులను నిల్వ చేయటం లేదు. సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కేవలం వరి ధాన్యాన్ని మాత్రమే ఇక్కడ కొంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మార్కెట్ కమిటీ గోదాం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇక్కడ గోదాం ఖాళీగా ఉన్నందున మందుబాబులకు అడ్డాగా మారింది. వేళా పాళా లేకుండా ఇక్కడ మద్యం సేవించి ఎవరికి వారు వెళ్తుంటారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రైతులకు ఉపయోగ పడాల్సిన గోదాం.. మందుబాబులతో పాటుగా.. పశువులు, గొర్రెలు, మేకలకు నిలయంగా మారింది. గోడౌన్ గేట్లను కూడా దొంగలు పగుల గొట్టి ఎత్తుకెళ్లారు.



గొర్రెలకు నిలయంగా మారిన తల్లాడ గోదాం

రైతులకు అందుబాటులోకి తేవాలి..



మల్లవరం సమీపంలో మార్కెట్ కమిటీ గోదాంను రైతులకు అందుబాటులోకి తేవాలి. పండించిన పంటలను దాచుకోవాలంటే గిడ్డంగులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ కమిటీ గోదాంను రైతులకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలి.

– కర్లకంటి భూషణం, రైతు, బిల్లుపాడు

రూ.లక్షలు వెచ్చించారు..



మార్కెట్ కమిటీ గోదాంను లక్షల రూపాయలతో నిర్మించి వదిలేశారు. దీంతో రైతులకు ఉపయోగం పడటం లేదు. పండించిన పంట ఉత్పత్తులను దాచుకొనేందుకు అవకాశం లేక నిలువునా అమ్ముకోవాల్సి వస్తోంది. రైతుల కోసం ఈ గోదాంను ఉపయోగించాలి.

– గొడుగునూరి లక్ష్మీరెడ్డి, రైతు, నారాయణపురం

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి

‘లంకెల’ సేవలు అభినందనీయం

మధిర: ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న లంకెల మోహన్ రెడ్డి ఎంతోమంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దోహదం చేశారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు అన్నారు. సోమవారం మండలంలోని నిదానపురం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా పనిచేసి పదవీ విరమణ పొందిన మోహన్‌రెడ్డి సన్మాన సభ నిర్వహించగా.. వారు పాల్గొని మాట్లాడారు. పీఆర్‌టీయూ మధిర సంఘ నిర్మాణంలో, సంఘ ఎదుగుదలలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, నాయకులు రవికుమార్, ప్రసాదరావు, మదార్ తదితరులు పాల్గొన్నారు.



లంకెల మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

దెందుకూరు ఉపాధ్యాయుడి పదవీ విరమణ..

దెందుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ (గణిత) ఉపాధ్యాయుడిగా తన జీవితకలంలోఅనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలీ అన్నారు. పదవీ విరమణ పొందిన ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం

చింతకాని: అంకిత భావంతో విధులను నిర్వహించి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన పరిశ రామ్మోహన్‌రావు ఆదర్శంగా నిలిచారని మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులను నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో విధులను నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. రామ్మోహన్‌రావుకు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, శర్మ, చిరంజీవినాయుడు, శ్రీనివాసరావు, మాధవీదేవి, రాంబాబు, రాజయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య, ఆంజనేయ శర్మ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌రావు సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

ప్రశస్త యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశస్త యాప్‌పై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ సెల్ ఫోన్‌లలో ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి, స్పెషల్ ఎడ్యుకేటర్స్ సామ్యూల్, పద్మ, సుమన్, సుభద్రలు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న కారేపల్లి స్టాల్



యూత్ ఫెస్టివల్‌లో కారేపల్లి స్టాల్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

కారేపల్లి: ఖమ్మంలో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌లో కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ స్టాల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కళాశాల మెకానిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన నిర్వహించిన స్టాల్‌ను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, డీవైఎస్ఓ సునీల్‌కుమార్ సందర్శించి ప్రశంసించినట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి తెలిపారు. ఫెస్టివల్‌లో కారేపల్లి కళాశాల మాత్రమే మోడల్‌ను ప్రదర్శించడంతో అధికారులు అభినందనలు తెలిపారన్నారు. యూత్ ఫెస్టివల్‌లో కళాశాల బాలికల డ్యాన్స్, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్ని ప్రతిభ చూపారని తెలిపారు.

కల్లూరులో నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

కల్లూరు: తిరుపతి లడ్డు కలుషితంపై విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కల్లూరులో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, కార్యదర్శి మిట్టపల్లి జగదీష్, కల్లూరు ప్రముఖులు లక్కినేని రఘు, గుర్రం వెంకటేశ్వరరావు, చలువాది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలలంలోని సిద్దారంరోడ్డులో గల దివ్యాంగుల సేవా ఆశ్రమంలో దివ్యాంగులకు బ్రెడ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. సత్తుపల్లి చెందిన దోసపాటి సాయి, శ్రావ్య దంపతుల కుమార్తె సైనిక పుట్టినరోజు సందర్భంగా వాటిని అందించి అక్కడే కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పేదలనేస్తం సేవా సంఘం వ్యవస్థాపకుడు పాలడుగు దుర్గాప్రసాద్, శ్రావ్య, జోత్స్న, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్, సభ్యులు అంజి, బాజీబాబా, సురేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన జంగం గాంధీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పుల సైదులు, గాంధీ ఇరువురు కలిసి మద్యం సేవించిన తర్వాత గొడవ పడతారు. దీనితో గాంధీ, సైదులుతో పాటు అడ్డువచ్చిన అతని భార్యను కూడా కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

‘విజయ’లో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్



టెక్నికల్ రౌండ్ పరీక్ష నిర్వహిస్తున్న ఐటీ హబ్ ఖమ్మం ప్రతినిధులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో హాల్మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్ హైదరాబాద్, ఐటీ హబ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో సోమవారం ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. టెక్నికల్, గ్రూప్ డిస్కషన్, హెచ్ ఆర్ రౌండ్స్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. బీటెక్ నాలుగో సంవత్సర విద్యార్థులు హాజరు కాగా.. మొదటి రౌండ్‌లో 60 మంది విద్యార్థులు ఇంటర్వ్యూ రౌండ్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ ఆయేషా తరుణమ్, డీన్ శ్రీనివాసరావు, ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

పొట్టెయ్య మృతి బాధాకరం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కారేపల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకుడు కరపటి పొట్టెయ్య మృతి బాధాకరమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, గోకినపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కొమ్ముగూడెంలో గుగులోత్ తేజానాయక్ అధ్యక్షతన నిర్వహించిన పొట్టెయ్య సంతాభ సభలో వారు పాల్గొని మాట్లాడారు. పొట్టెయ్య మృతి ఈ ప్రాంత ప్రజలకు, పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర అరుణ, గుమ్మడి సందీప్, భాస్కర్‌రావు, రావుల నాగేశ్వరరావు, పులకాని సత్తిరెడ్డి, కోయిల శ్రీనివాసరావు, ధరావత్ సక్రునాయక్, తేజావత్ రంగ్యా, వడ్డే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్ పర్యటన

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరంలో సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. స్థానిక నాయకులు శీలం కృష్ణారెడ్డి కుమారులు, కుమార్తెల పంచెలు, ఓణీల ఫంక్షన్‌కు హాజరై వారిని ఆశీర్వదించారు. కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు సాంబశివరావు, ఏఎంసీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కవిత, శ్రీకాంత్‌రెడ్డి, బహదూర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలింత ఎలా చనిపోయింది?

డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణ, వైద్యురాలికి నోటీసు

సత్తుపల్లి: ప్రసవం కంటే ముందు ఆరోగ్య పరిస్థితి బాగున్నప్పుడు.. ఆపరేషన్ తర్వాత ఎందుకు విషమించింది.. బాలింత శ్రావణి ఎలా చనిపోయిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.సీతారాం ప్రశ్నించారు. సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రిలో చికిత్స చేయించిన దమ్మపేట మండలం నాచారానికి చెందిన బాలింత శ్రావణి శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాలతో సోమవారం ఆయన విచారణ చేపట్టారు. గర్భిణిగా ఉన్నప్పుడు చేసిన చికిత్స కేస్‌షీట్ పరిశీలించారా, సాధారణ ప్రసవానికి ప్రయత్నించినప్పుడు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది.. ఆపరేషన్ తర్వాత ఖమ్మం ఎందుకు రిఫర్ చేశారని ప్రశ్నించారు. ఈమేరకు ఆస్పత్రి డాక్టర్ గుళ్లపల్లి రమ్య ఆపరేషన్ తర్వాత బాలింత శ్రావణికి బీపీ పెరగడం, ప్లేట్‌లేట్లు 60వేలకు పడిపోగా ఖమ్మం రిఫర్ చేశామని చెప్పారు. కాగా, ఆస్పత్రికి వచ్చిన పేషెంట్ చనిపోయే పరిస్థితికి చేరే వరకు ఏం చేశారు, వైద్యులుగా బాధ్యత లేదా అని ప్రశ్నించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ, పేషెంట్ చనిపోయాక మేనేజ్ చేసుకోవటం మంచిది కాదని పేర్కొన్నట్లు తెలిసింది. ఈమేరకు డాక్టర్ రమ్యకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు తెలిపారు. విచారణలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంట గంగారం, లంకాసాగర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆర్.అవినాష్, చింతా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

15వ బెటాలియన్‌లో క్రీడా పోటీలు ప్రారంభం..



పావురం ఎగరవేసి పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ చటర్జీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ట్రెనింగ్ సెంటర్‌లో ఎస్‌సీటీపీఎస్ఎస్ గ్రేమ్స్ అండ్ స్పోర్ట్స్‌మీట్‌ను కమాండెంట్ పీజేపీసీ చటర్జీ సోమవారం తెల్లపావురాన్ని ఎగురవేస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశాల మేరకు శిక్షణలో ఉత్తీర్ణులైన ఎస్‌సీటీపీఎస్ఎస్‌కు గ్రేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. ఆటల వలన శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ కూడా ఆటల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థినులు..



జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

మధిర: జిల్లా స్థాయి బాలికల క్రీడల్లో మధిర జోన్ నుంచి వాలీబాల్ అండర్–17లో పాల్గొన్న కొండూరి కవిత, అండర్–14 విభాగంలో పాల్గొన్న నరెడ్ల లక్ష్మి తిరుషా రెడ్డిలు జిల్లా జట్టుకి ఎంపికయ్యారు. దీంతో విద్యార్థులను మర్లపాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం భీమరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక..

తల్లాడ: ఖమ్మం జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో లూర్థుమాతా పాఠశాల విద్యార్థులు అండర్–17 బాలికల విభాగంలో, అండర్–14 బాలికల విభాగంలో తమ ప్రతిభ కనబర్చారు. అండర్–17 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో కె.సంవిధ ద్వితీయ బహుమతి, అండర్–14.. వంద మీటర్ల రన్నింగ్‌లో పి.సాయి స్రవంతి 4వ స్థానం సాధించారు. అండర్–14 బాలుర విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో ఎం.చరితేస్ 4వ స్థానం, కె.సంవిధ, 800 మీటర్లలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు. గెలుపొందిన విద్యార్థులను సోమవారం తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, హెచ్ఎం ప్రసూన, ఉపాధ్యాయులు అభినందించారు.

జీపీ, పీహెచ్‌సీలో జాయింట్ కమిషనర్ పరిశీలన



ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో కృష్ణన్

బోనకల్: బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ కృష్ణన్ సోమవారం సందర్శించారు. జాతీయ స్థాయిలో అవార్డు కోసం గ్రామంలో స్వయం సమృద్ధి, మౌలిక వసతులు తదితర అంశాలపై ఆన్‌లైన్ చేసిన డేటాను పరిశీలించారు. అలాగే, రికార్డులు తనిఖీ చేసి సూచనలు చేశారు. అనంతరం ఆయన పీహెచ్‌సీని కూడా పరిశీలించి వసతులు తెలుసుకున్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ కోటేశ్వర శాస్త్రి, డాక్టర్ స్రవంతి, సీహెచ్ఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లాబ్ టెక్నీషియన్ తొలగింపు

పెనుబల్లి: పెనుబల్లి ఏరియా ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రతిభను విధుల నుండి తొలగిస్తూ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల 27న ఆస్పత్రిని అదనపు కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇన్ పేషంట్లకు రక్తపరీక్ష చేయాల్సి వస్తే ప్రైవేట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారని పలువురు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టరేట్ సూచనతో విచారణ చేపట్టిన డీసీహెచ్ఎస్.. ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలకు సిఫారసు చేశారు. ఈమేరకు ఆమె తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ప్రతిభకు పెనుబల్లి ఆస్పత్రి ప్రధాన వైద్యులు కిరణ్‌కుమార్ ఉత్తర్వులు అందించారు.

మోసం చేసిన బృందానికి ఇల్లు ఇప్పించిన వ్యక్తి అరెస్ట్

మధిర: ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షల్లో వసూలు చేసిన వారికి ఇల్లు ఇప్పించిన వ్యక్తిని మధిర పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో రాబట్టుకుని చేతులు ఎత్తేసిన అనిల్ బాబు, శశాంక, అనుదీప్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. అయితే, శశాంక, అనిల్ బాబును కొన్నాళ్ల క్రితం విజయవాడకు చెందిన కాశీ రుద్ర మధిర టీచర్స్ కాలనీలో ఉపాధ్యాయుడి ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేశాడు. శశాంక తనకు బంధువని, హైకోర్టు లాయర్ అయిన తాను మరో లాయర్ అనిల్‌బాబుతో ఇక్కడ కార్యాలయం తెరిపిస్తున్నట్లు చెప్పి ఇల్లు ఇప్పించాడు. అయితే, అనిల్ బాబుకు తాను షూరిటీ ఉండి స్కూటీ ఇప్పించగా వాయిదాలు చెల్లించకపోవడంతో వాహనం తీసుకెళ్తానని ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగితోపాటు సోమవారం రాత్రి రాగా ఇంటి యజమాని కాశీ రుద్రను నిలదీశాడు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మధిర టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాశీ రుద్రను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

హామీలు అమలు చేయాలి

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ప్రకాష్‌నగర్, కాకర్లపల్లి గ్రామాల్లో కువ్వారపు లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సనందన్‌రావు, శ్రీనివాసరావు, రఘు, రత్తయ్య, కమలమ్మ వీరయ్య, రాఘవులు, వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

వైరారూరల్: బ్యాంకు రుణాలు పొందిన రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండంలోని వల్లాపురంలో నిర్వహించిన సీపీఎం గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు నాగేశ్వరరావు, బాజోజు రమణ, గొర్రెముచ్చు జైపాల్ పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు పంపిణీ

మధిర: సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చి విద్యనభ్యసిస్తునవిద్యార్థులకోసం తానా ఫౌండేషన్ ఉచితంగా సైకిళ్లు అందించారు. సోమవారం మండలంలోని మహాదేవపురం జెడ్పీ పాఠశాలలో ఎన్నారై కాట్రగడ్డ సునీత జ్ఞాపకార్థం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల సహకారంలో ఏర్పాటు చేసిన సైకిళ్లను ఎంఈఓ వై.ప్రభాకర్ విద్యార్థినులకు అందించి మాట్లాడారు. తానా ఫౌండేషన్ బాలిక విద్యను ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. అనంతరం పాఠశాలలో.. గెజిటెడ్ హెచ్ఎం సీహెచ్.సాధు సమాదానం అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మా ట్లాడారు. పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఏఏపీసీ చైర్మన్ మరియమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సుబ్బారావు, సుధాకర్, కృష్ణవేణి, లక్ష్మీ ప్రసన్న కుమారి, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని కార్మికుల ఆందోళన

కొణిజర్ల: మండలంలోని లాలాపురం సమీపాన ఏర్పాటుచేసిన రానెకేర్ సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ కార్మికులు సోమవారం గేట్‌కు తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీలో బరువు తక్కువతో కూడిన సిమెంట్ ఇటుకలు తయారు చేస్తారు. ఈక్రమాన యాజమాన్యం నాలుగు నెలులుగా సిబ్బంది, కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. జీతాలు ఇవ్వకపోవడమేకాక పీఎఫ్ పేరిట విధించే నగదును ఖాతాకు జమ చేయడం లేదన్నారు. ఈ మేరకు అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు